క్లుప్తంగా

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ



కుళ్లిన అంగన్‌వాడీ కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాపన్‌పల్లి గ్రామంలో ఒకరి ఇంట్లో ఉడకబెట్టగా.. దుర్వాసన రావడంతో వాటిని పారవేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోజుల తరబడి నిల్వ ఉన్న కోడిగుడ్లు అందించడంతో చిన్నారులు, బాలింతలు అనారోగ్యం పాలవుతున్నట్లు వాపోయారు. ఇంత జరుగుతున్నా సదరు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జనం చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు అందేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై సూపర్‌వైజర్ రజితను వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లను అందిస్తున్నాం. కుళ్లిన కోడిగుడ్ల విషయం మా దృష్టికి రాలేదు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

ఉచిత వైద్య శిబిరాలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నెన్నెల/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ మంచిర్యాల క్లబ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ మంచిర్యాల చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో, నెన్నెల మండలంలోని మైలారంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో 420మంది, నెన్నెలలో 250మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డీసీపీ భాస్కర్, లయన్స్ క్లబ్ మంచిర్యాల చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాపల్లిలో రక్తదాన శిబిరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలో ఆదివారం మంచిర్యాల వాలంటరీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రహమత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ప్రారంభించారు. రక్తదానంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో దాదాపు 100యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించగా దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై చాంద్‌పాషా, ఫౌండేషన్ సభ్యులు ఎం.డీ.యూనస్, సాదిక్, నయీం, అజాద్, హఫీజ్, కరీం, అహి, యాకూబ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది భాస్కర్‌రెడ్డి, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలో ఈద్ మిలదు ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఆదివారం ముస్లింలు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జాఫర్‌నగర నుంచి ప్రారంభమైన బెల్లంపల్లి చౌరస్తా ,హెచ్‌పీ పెట్రోల్, శ్రీనివాస్‌టాకీస్ ,ముఖరాం చౌరస్తా మీదుగా మార్కెట్ రోడ్ నుంచి జాఫర్ నగర్ మసీద్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు ఖలీమ్‌ఖాన్, సోహెల్‌ఖాన్, సాకిర్‌అహ్మద్, సయ్యద్ ఆఫాన్, సయ్యద్ అబీబ్, జవీద్‌ఖాన్, సయ్యద్ జుబేర్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్‌సిటీ కాలనీలో అడుగుకో గుంతగా మారిన రోడ్డు



జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గుంతలుగా మారిన రోడ్డు



అడుగుకో గుంత.. ప్రయాణికుల చింత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని అంతర్గత రోడ్లు గుంతలుగా మారి ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రంగా ఉండి, కార్పొరేషన్‌గా మారినా కేవలం ప్రధాన రహదారులు మాత్రమే బాగుండగా, కాలనీల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లు పూర్తిగా గుంతలుగా మారాయి. అడుగుకో గుంతగా మారిన రోడ్లపై వాహనదారులు ఇబ్బంది పడుతుండగా, పాదాచారులకు గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో నడిచేందుకు ఇబ్బందిగా మారింది. ఇటీవల వినాయక నిమజ్జనం నేపథ్యంలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే పనులను చేపట్టామని అధికారులు చెబుతున్నా, పట్టణంలోని ఏ రోడ్డుపై చూసినా గుంతలే కనిపిస్తుండడంతో గుంతలను ఎక్కడ పూడ్చారనే దానిపై సందిగ్ధం నెలకొంది.



రాంనగర్‌లో గుంతలుగా మారిన రోడ్డు

అధ్వానపు రోడ్లు.. అవస్థల్లో ప్రజలు



దుగ్నెపల్లికి వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు



చెన్నూర్ మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెరువుకట్ట పైనుంచే వెళ్లాలి. కాగా, చెరువు సమీపంలో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. చెరువు కట్టపైకి వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుపై గుంతలు పూడ్చాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– చెన్నూర్‌రూరల్

అసంపూర్తి పనులు.. ప్రజల అవస్థలు



దండేపల్లి: మండలంలోని గూడెం నుంచి మేదరిపేట వరకు గల రింగ్ రోడ్డు విస్తరణ పనులు వెల్గనూర్ సమీపంలో ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం ప్రారంభమైన పనులు వెల్గనూర్‌లో మాత్రం పూర్తి కాలేదు. అధికారులు స్పందించి వెల్గనూర్ సమీపంలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల తిప్పలు

దండేపల్లి: లక్సెట్టిపేట–నిర్మల్ రహదారిపై దండేపల్లి మండలం మేదరిపేట సమీపంలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. వాటిని పూడ్చడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



అల్లుకుపోయిన తీగ బంధం



జన్నారం: నిలువెత్తు గల టవర్‌ను తీగ అల్లుకుపోయింది. ఫలితంగా టవర్ కనిపించకుండా అల్లుకొని ఆ తీగ పచ్చదనాన్ని పంచుతుంది. జన్నారం మండలం కలమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ టవర్‌కు తూటి తీగ అల్లుకుపోయిన దృశ్యాన్ని'సాక్షి' క్లిక్ మనిపించింది.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ రోడ్ నంబర్ 4లో విద్యుత్ సర్వీస్ కేబుల్స్ కిందికి ఉండడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ అధికారులకు పలుమార్లు చెబుతున్నా పట్టించుకోవడం లేదని, కిందకి జారిన సర్వీస్ వైర్లతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందునా వాటిని సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో... →





రోడ్డును ఆక్రమిస్తున్న చెట్ల కొమ్మలు

భీమారం: మండల కేంద్రం నుంచి నెన్నెల ప్రధాన రహదారిలో పోతన్‌పల్లి గ్రామ సమీపంలో రోడ్డును ముళ్ల చెట్ల కొమ్మలు ఆక్రమిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాలపై వెళ్లేవారికి కొమ్మలు తాకి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని చెట్ల కొమ్మలు నరికించాలని ప్రజలు కోరుతున్నారు.

సన్నబియ్యానికి రెక్కలు..!

- జోరుగా రేషన్ దందా

దండేపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతోంది. రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం సరఫరా చేయడంతో లబ్ధిదారులు పెద్దఎత్తున రేషన్ దుకాణాలకు వెళ్లి సన్నబియ్యం తెచ్చుకుంటున్నారు. గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు మాత్రం కొంతమంది ఇష్టపడేవారు కాదు. సన్నబియ్యం సరఫరా చేస్తున్నప్పటి నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వినియోగదారులందరూ ప్రతి నెలా క్రమం తప్పకుండా రేషన్ బియ్యాన్ని తీసుకోవడంతో పాటు, చాలా మంది తింటున్నారు. గతంలో దొడ్డు బియ్యం తినలేక అమ్ముకునేది. అయినప్పటికీ గతంలో మండలంలో రేషన్ దందా చేసిన వారు, ప్రస్తుతం సన్నబియ్యాన్ని కూడా వదలడం లేదు. అక్రమ దనార్జనే ధ్యేయంగా మళ్లీ ఎప్పటిలాగే రేషన్ దందా సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు రేషన్ వినియోగదారులను మభ్యపెట్టి కిలో బియ్యానికి రూ.18నుంచి రూ.20 చొప్పున చెల్లించి కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం పంపిణీ సమయంలో గ్రామాల్లో కమీషన్ ఏజెంట్లను నియమించి బియ్యం సేకరించి తరలించాల్సిన చోటికి తరలిస్తున్నారు. మండలంలోని నంబాల గ్రామంలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన 7క్వింటాళ్ల 50కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ప్రతి నెలా దండేపల్లి మండలంలోని నంబాలతో, నెల్కివెంకటాపూర్ గ్రా మాల నుంచి రేషన్ బియ్యం పెద్దమొత్తంలో తరలిస్తున్నట్లు సమాచారం. రేషన్ అక్రమ రవాణాను అరికట్టడంలో సంబంధిత అధికారులు మామూళ్లుగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు దృష్టిసారించి రేషన్ అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీటీ మాధవిని సంప్రదించగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులు నమోదు చేస్తామని చెప్పారు.



నంబాలలో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

సమాచారం

నేడు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా

పాతమంచిర్యాల: సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ నాయకులు, ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు రైతు వేదికల్లో యూరియా పంపిణీ

దండేపల్లి: యూరియా సరఫరాలో సమస్యతో రైతులు పీఏసీఎస్‌లు, హాకా సెంటర్ల ఎదుట బారులు తీరుతున్నారు. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు వేదికల్లోను యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండేపల్లి మండలంలో సహకార సంఘాలతో పాటు, రైతు వేదికల వద్ద సోమవారం యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఏవో గొర్ల అంజిత్‌కుమార్ తెలిపారు. నెల్కివెంకటాపూర్, గూడెం సహకార సంఘాలతో పాటు ముత్యంపేట, ద్వారక, లింగాపూర్ రైతు వేదికల వద్ద యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏవో పేర్కొన్నారు. మండలానికి 72టన్నుల యూరియాను తెప్పిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమకు అందుబాటులో గల సహకార సంఘాలు, రైతువేదికల వద్దకు వచ్చి యూరియాను తీసుకెళ్లాని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సేవాపక్షం జిల్లా కన్వీనర్ పట్టి వెంకటకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిలు వస్తున్నారని, ఉదయం 8:30గంటలకు జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌కు రావాలని కోరా రు. దాతలు ముందుగా 88864 44123 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

సోషల్ మీడియా కో కోఆర్డినేటర్‌గా రోషన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్‌గా ఎన్నికైన బొడ్డు రోషన్‌కు ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన నివాసంలో నియామక పత్రాన్ని అందించారు.



కోదండరామాలయం కమిటీ ఎన్నికలు

- ఉద్రిక్తత మధ్య పోలింగ్, కొత్త చైర్మన్ ఎన్నిక



వాయిదా వేయొద్దని నినాదాలు చేస్తున్న స్థానికులు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయం కమిటీ ఎన్నికలు ఆదివారం ఉద్రిక్తత మధ్య జరిగాయి. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేతల ఆధ్వర్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో చైర్మన్ పదవికి మొత్తం ఏడుగురు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల నిర్వహణపై మాజీ చైర్మన్ చేకూర్తి సత్యనారాయణ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలను వాయిదా వేయాలని ఆయన పట్టుబట్టడంతో, పోలీసులతో వాగ్వాదం కూడా జరిగింది. అయితే, గ్రామంలో ఎక్కువమంది ఎన్నికలు వెంటనే జరపాలని కోరడంతో పోలీసులు పోలింగ్ నిర్వహించారు. ప్రతి కులం నుంచి ఐదుగురి చొప్పున మొత్తం 81 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ అంజమ్మ వ్యవహరించారు. ఓట్ల లెక్కింపు అనంతరం కొత్తపోటు రాజేశ్వర్ రెడ్డి 35ఓట్ల మెజార్టీతో చైర్మన్‌గా గెలుపొందారు. అనంతరం చైర్మన్‌ను, సభ్యులను సీఐ, అధికారులు అభినందించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానికులను మాత్రమే లోపలికి అనుమతించారు. కొద్దిసేపు బీజేపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగినా, చివరికి వారిని కూడా లోపలికి అనుమతించారు.

ఆలయ అభివృద్ధికి భారీ విరాళం

భీమారానికి చెందిన చెర్కు సరోత్తం రెడ్డి ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.1,16,000 విరాళం ప్రకటించారు. అంతేకాకుండా, ఆలయ అభివృద్ధి కోసం మరో రూ.50 లక్షల విరాళాలను కూడా సేకరిస్తానని తెలిపారు.

'సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి'

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా ప్రకటించి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో విలీన దినోత్సవాన్ని ఏటా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. నస్పూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ వేడుకల్లో ఆయన జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి పాల్గొన్నారు. సీసీసీలోని నర్సయ్య భవన్ వద్ద అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే పోరాట వారోత్సవాల ముగింపు సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, నగేశ్, జిల్లా సమితి నాయకులు పూజారి రామన్న, ఎస్‌కే బాజీసైదా, దొడ్డిపట్ల రవీందర్, నాయకులు సురేశ్, సందీప్, సంతోష్, లచ్చిరెడ్డి, శంకరయ్య, పోషం, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ'

బెల్లంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యదర్శి ఆడేపు రాజమౌళి విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ వేడుకలను ఆదివారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్టేషన్ రోడ్‌కాలనీలో తిరుపతి గౌడ్, రైల్వే రడగంబాల బస్తీలో అక్కెపల్లి బాపు అరుణ పతాకాలను ఆవిష్కరించి అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ సహాయకార్యదర్శి తిలక్, డీఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జీసీ మాణిక్యం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూతోనే సొంతింటి కల సాకారం

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికులకు సొంతింటి కల సీఐటీయూతోనే సాకారమవుతుందని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో సింగరేణి ఉద్యోగులకు సొంతింటి కల విషయమై గనులు, డిపార్టమెంట్లపై సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాలట్ బాక్స్‌లు ఏర్పాటు చేయగా కార్మికులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బ్యాలట్ బాక్స్‌లను తెరిచి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజారెడ్డి హాజరై ఓట్లను లెక్కించారు. ఏరియాలో సుమారు 4700 పైచిలుకు మంది కార్మికులు ఉండగా విధులకు హాజరయ్యే సుమారు 70శాతం అంటే 2418మంది ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. 2280మంది కార్మికులు సొంతింటి కోసం, 133మంది క్వార్టర్ కోసం, 5గురు రెండింటిలో ఏదైనా పర్వాలేదని ఓటింగ్ చేశారన్నారు. 15న కార్మికులు సమస్య సాధన కోసం జీఎం ఆఫీస్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమయంలో సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజ్‌గోపాల్, ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు రామస్వామి, నాయకులు ఐలయ్య, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

లాభాల వాటా ఇప్పించేందుకు కృషి

నస్పూర్: గత ఆర్థిక సంవత్సరం లాభాల వాటాను వారం రోజుల్లో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన పలు డిమాండ్ల పరిష్కారానికై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో వారం రోజులుగా పలువురు రాష్ట్ర మంత్రులను, సింగరేణి సంబంధిత ముఖ్య అధికారులను కలిసి చర్చలు జరిపామన్నారు. సమస్యల పరిష్కారానికి వారు సానుకూలంగా స్పందిచారన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు గరిగ స్వామి, కలవేణ శ్యాం, తిరుపతి రాజు, పేరం రమేశ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, చాట్ల అశోక్, తిరుపతి రెడ్డి, ల్యాగాల శ్రీనివాస్,మనోజ్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఇండోర్ గేమ్స్ ప్రారంభం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా ఎల్లందు క్లబ్‌లో డబ్ల్యూపీఎస్ అండ్ జీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇండోర్ గేమ్స్ టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ పోటీలను ఏరియా జీఎం రాధాకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ చీఫ్ కోఆర్డినేటర్ కార్తీక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా పెంపు

నస్పూర్: దేశవ్యాప్త బొగ్గు గనుల ప్రమాదాలకు ఎక్స్‌గ్రేషియాను రూ.15లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంపునకు కేంద్రం నిర్ణయం తీసుకుందని బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, జేబీసీసీఐ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తాము చేసిన అవిశ్రాంత పోరాటాల ఫలితంగానే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్‌గ్రేషియా పెంపు నిర్ణయం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు.